ఆదివారం ప్రత్యేకం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 3 నవంబరు 2024 | 5





వర 'ప్రసాదం'

భక్తునికి, భగవంతునికి అనుసంధానమైంది అగరుబత్తి అన్నట్టుగానే దేవుడికి, భక్తుడికి అనుసంధానమైంది మరొకటి ఉంది. అదే ప్రసాదం. దేవుడికి పెడితే నైవేద్యం. తర్వాత అది భక్తుడికి చేరితే ప్రసాదం. ఈ ప్రసాదం విశేషాలు.. - 6లో

కార్తీక సందడి





ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి భక్తుల రాక
ప్రత్యేక పూజలు

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ద్రాక్షారామ, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కార్తీక సందడి నెలకొంది. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులు తరలివచ్చారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు అన్నదాన మండపంలో అన్నప్రసాదం అందచేశారు. కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయంలో పుష్పాలంకరణ చేశారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవానీ భక్తులకు వసతి సౌకర్యాలను కల్పించారు.

మురమళ్ల ఆలయానికి కార్తీక శోభ

ఐ.పోలవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటుతో పాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. స్వామి వారి నిత్యకళ్యాణంతో పాటు అభిషేకాలను తిలకించేందుకు ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు.



విద్యుత్ దీపాల అలంకరణలో మురమళ్ల ఆలయం



యానాం: పుష్కర్‌ఘాట్ రావిచెట్టు వద్ద పూజలు

'కోటిపల్లి'కి భక్తుల తాకిడి



కె.గంగవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం ప్రారంభం కావడంతో కోటిపల్లిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఛాయాసోమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పుష్కరాల ఘాట్‌లో రాజమహేంద్రవరానికి చెందిన సంబారు దిగ్విజయవెంకటశ్రీనివాస్ శివలింగం ప్రతిష్ఠ చేశారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవా సమితి సభ్యులు, అభయాంజనేయస్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు



అంతా తామై..

- ఇంటి మేనేజర్లు.. బాధ్యతల ఇంజనీర్లు
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- వృత్తి.. కుటుంబం.. రెండు కళ్లుగా పయనం
- నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం

చదువులో ఎంత రాణించినా.. ఏ హోదాకు ఎదిగినా.. ఉన్నత స్థానాన్ని అందుకొన్నా.. ఒక మహిళకు గృహిణిగా ఉన్న బాధ్యత ముందు అవన్నీ చిన్నవే. భర్త అవసరాలను తీర్చి.. పిల్లల అలనాపాలనా చూస్తూ.. పెద్దలను సముదాయిస్తూ.. ఇంటిని చక్కబెట్టుకుంటూ.. ముందుకు సాగాలి. ఇంట్లో వాళ్లకు ఏ సమయానికి ఏమి కావాలో చూసుకోవడమే ప్రధాన విధిగా రోజులు గడుపుతుంది. ఆమె చేసే ఇంటి పనులను ఆర్థికంగా లెక్కగడితే పురుషుల సంపాదన దిగదుడుపే. అందుకే ఇంటికి వెలుగు ఇల్లాలు అనే నానుడి అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ బాధ్యతల బరువును మోస్తూనే ఉంటుంది. ఇక వివిధ పదవుల్లో, ఉద్యోగాల్లో ఉన్న గృహిణులైతే అటు ఆ బాధ్యతలు ఇటు ఇల్లు చక్కబెట్టుకోవడంతోనే జీవితం సాగిపోతుంది. ఈ క్రమంలో తమ సంతోషాలనూ త్యాగం చేస్తారు. ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి



కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకలు చేసుకుంటున్న జిల్లా కలెక్టర్

చిన్న చిన్న సంతోషాలకు దూరమవుతాం..

2007లో పార్వతీపురం ఆర్డీవోగా విధుల్లో చేరాను. 2008లో పెళ్లయింది. ప్రస్తుతం పాప సెవన్త్, బాబు పదో తరగతి. మాకు పరిచయం అయిన తర్వాత పెద్దల అంగీకారంతో వివాహం జరిగింది. అప్పటి నుంచీ గృహిణిగా బాధ్యతలు వచ్చాయి. నాన్న, అమ్మ, అత్తమ్మ ముగ్గురూ మాతోనే ఉంటారు. మామయ్య లేరు. గృహిణిగా నా బాధ్యతల్లో కొన్ని వాళ్లు తీసుకున్నారు. పిల్లల బాధ్యత పూర్తిగా నేను తీసుకుంటాను. ఆఫీస్ పని అయిపోయాక వాళ్లతో గడపడానికి ప్రయత్నిస్తాను. నేను ఇంటికి వెళ్లేప్పటికి రాత్రి 9గంటలు అవుతుంది. చిన్నప్పుడు నా సమయం సర్దుబాటు చేసుకొని వాళ్లకు నేనే వండి పెట్టడం జరిగేది. లంచ్ సమయంలో కాస్త సమయం కుదిరేది కాదు. రాత్రి నేను వెళ్లే వరకూ ఇద్దరు పిల్లలూ వేచి చూస్తుంటారు. ఆలస్యం అయినా అలాగే ఉంటారు. నాకు బాగా ఆలస్యమైతే అన్నం తినేసినా నాకోసం అర్ధరాత్రి వరకూ ఎదురుచూస్తూనే ఉంటారు. మా హస్బండ్ ఢిల్లీరావు డైరెక్టర్ ఆఫ్ ఏపీ అగ్రికల్చర్. విజయవాడలో ఇప్పుడు బాబు ఆయన దగ్గర ఉంటున్నారు. పాప నా దగ్గర ఉంటోంది. ఏదేమైనా పిల్లలతో గడపాల్సిన చాలా సమయం మిస్ అవుతున్నాం. చిన్న చిన్న సంతోషాలను అందించలేకపోతున్నాం. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చినప్పుడు ఎదురెళ్లి దగ్గరకు తీసుకోలేకపోతున్నాం. వాళ్లు ఆ సమయంలో ఏమైనా మాకు చెప్పాలని ఆతృతతో వచ్చినా మేం ఇంటికెళ్లే వరకూ ఎదురుచూడక తప్పదు. పుట్టినరోజులు మిస్ అవుతాం. మొన్న సెప్టెంబరు 1న బాబు పుట్టినరోజు. ఇక్కడ ఉధృతంగా వరదల వల్ల బిజీగా ఉన్నాను. నాకు సమయం లేకపోవడంతో నా ఆశీర్వాదం కోసం విజయవాడ నుంచి బాబు వచ్చాడు. ఇలాంటివి పిల్లల మనసునూ కాస్త బాధ పెడతాయి. బాధ్యతలు తీసుకొనేప్పుడే ఉద్యోగ బాధ్యతలు ఏమిటి, ఎంత సమయం ఉంటుంది? వ్యక్తిగత జీవితం ఎలా ఉంటుందీ తెలుసు. అందువల్ల వ్యక్తిగత జీవితాన్ని సర్దుబాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు అందరూ వస్తారు. నువ్వు రావడంలేదని మా పాప ప్రశ్నిస్తూనే ఉంటుంది. ఏదో సర్దిబుచ్చుతాం. మేం చాలావరకూ వెళ్లలేం. టీచర్లతో ఫోన్లోనే మాట్లాడే పరిస్థితి ఉంటుంది. పిల్లలే కాకుండా కుటుంబపరంగా జరిగే వేడుకలు తదితర కార్యక్రమాలకు కూడా హాజరుకాలేం. సమయం దొరికినప్పుడు నేనే వండి పెడతాను. నేను ఇంట్లో ఉండే వండి పెట్టాలని పాప డిమాండ్ చేస్తుంది కూడా. పిల్లల విషయంలో చిన్న చిన్న సున్నితమైన అనుభవాలు కోల్పోతూ ఉంటాం. ఇంట్లోనే ఉంటున్నాం.. ఏమీ చేయలేకపోతున్నాం.. అని కొందరు గృహిణులు బాధపడుతూ ఉంటారు. కానీ వాళ్ల కంట్రిబ్యూషన్ వాళ్లకు తెలియడం లేదు. ఎంత చదువుకున్నా.. ఎన్ని సర్టిఫికెట్లు ఉన్నా.. ప్రధానంగా విలువలు అనేవి ఇంట్లో నుంచే అలవడతాయి. ఓ ఇంజనీరును, డాక్టరును, కలెక్టర్‌ని తయారుచెయ్యగలం కానీ నైతిక విలువలు, బాధ్యతలు అనేవి కుటుంబ వ్యవస్థ నుంచే, అదీ అమ్మ నుంచే 90 శాతం వస్తాయి. ఎవరైతే పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతారో పిల్లలకు విలువలు అందించడంలో విజయం సాధిస్తారు. చట్టంకంటే ఇంట్లోనే మంచి చెడులను చెప్పగలిగితే చాలావరకూ సమస్యలు ఉండవు. అందువల్ల పిల్లల క్యారెక్టర్ బిల్డింగ్‌లో గృహిణులు పూర్తి న్యాయం చేయగలుగుతారు. ఒకటి జిల్లా, రెండు సొంత కుటుంబం. రెండు కుటుంబాలనూ బ్యాలెన్స్ చేసుకోవాల్సిన బాధ్యత కూడా మాపైనే ఉంటుంది. గృహిణులకు ప్రపంచ గృహిణుల దినోత్సవ శుభాకాంక్షలు. - ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



గృహిణి నుంచి.. ఎమ్మెల్యేగా..

ఇంటి బాధ్యతలు ఆమె దినచర్య.. రాజకీయ నాయకుడైన తన భర్త యోగక్షేమాలు, పిల్లలను చదివించుకోవడం ఆమె విధి. వంటావార్పు సరేసరి. ఆమె కుటుంబంలో ఊహించని షాక్. భర్త గుండెపోటుతో ఆకస్మిక మృతి. ఆ షాక్ నుంచి కోలుకుని తన భర్త ఆశయ సాధనకోసం గృహిణి స్థానం నుంచి నెలల వ్యవధిలో ఎమ్మెల్యే స్థానానికి ఎదిగారు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా. ఏడాదిన్నర కిందట వరకు వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజాకు సతీమణి మాత్రమే. రాజకీయాలతో పనిలేదు. 2019లో టీడీపీ అభ్యర్థిగా వరుపుల రాజా పోటీచేసి ఓడిపోయారు. 2023 మార్చి 4న రాజా గుండెపోటుతో ఆకస్మికంగా మృతితో అప్పటివరకు నుంచి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలు సత్యప్రభపైనే టీడీపీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి విపరీతంగా శ్రమించి పార్టీ బాధ్యతలు ముందుకు నడిపించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రత్తిపాడు ఎమ్మెల్యే అయ్యారు. తన భర్త రాజా నియోజకవర్గానికి ఏం చేయాలో ఏవిధమైన అభివృద్ధి చేపట్టాలో కన్న కలలను ఆమె సాకారం చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవద్దని, ఎదురొడ్డి నిలబడి విజయాన్ని అందుకోవాలని ఆమె సూచించారు.

- ఆంధ్రజ్యోతి/ప్రత్తిపాడు



సీహెచ్ వసంతకుమారి
మహిళా సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి

త్యాగం తప్పదు..

పెళ్లయిన పదేళ్లకే మావారు కాలం చేశారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. గృహిణిని. పెళ్లయిన తర్వాత నా భర్త నేను చదువుకోడానికి చాలా ప్రోత్సాహం ఇచ్చారు. నన్ను గ్రూప్-1 అధికారిగా చూడాలని కోరిక. కానీ తీరలేదు. కానీ 2007లో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాను. డిప్యూటీ జైలర్ (ఎస్ఐ క్యాడర్)గా రాజమండ్రిలో విధుల్లో చేరాను. తర్వాత కడప, వరంగల్‌లో పనిచేసి రాజమండ్రి మహిళా ప్రత్యేక కారాగారం సూరింటెండెంట్‌గా వచ్చాను. కొన్ని కావాలంటే మరికొన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. నేనూ అదే చేశాను. పిల్లలకు మంచి జీవితం అందించాలనేదే ఆశయం. ఉద్యోగ బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా.. పిల్లలకు వండి పెట్టుకోడానికి సమయాన్ని సర్దుబాటు చేసుకోవడం అలవాటైంది.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



అంగన్‌వాడీలో టీచర్‌గా.. ఎమ్మెల్యేగా శిరీషదేవి

గృహిణి నుంచి అంగన్వాడీ టీచర్.. ఇప్పుడు అసెంబ్లీలో..

ఆమె ఓ సాధారణ గృహిణి.. అంగన్వాడీ టీచర్.. రెండింటి మధ్యా సమన్వయం చేసుకుంటూ సాగే జీవితం. ఇప్పుడు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి. రాజవొమ్మంగి మండలం గింజర్తి శిరీషదేవి సొంతూరు. సాధారణ గిరిజన కుటుంబం. శిరీషదేవి మూడో ఏటనే ఆమె తండ్రి మరణం. కుటుంబ బాధ్యతలు ఆమె తల్లివే. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు శిరీషదేవి చదువు తన సొంతూరులోనే. ఆరు నుంచి పదో తరగతి వరకు సింగంపల్లి. ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజవొమ్మంగి. డిగ్రీ (బి.ఎ) సెయింట్ పాల్ కళాశాల రాజమహేంద్రవరం. బీఈడీ ఆదిత్య కళాశాల కాకినాడ. ఆ సమయంలోనే శిరీషదేవికి 2015లో మఠం భాస్కర్‌తో వివాహం. వీరిది ప్రేమవివాహం. అత్తగారిది అనంతగిరి. శిరీషదేవి గృహిణిగా జీవితం మొదలైంది. తర్వాత అనంతగిరి అంగన్వాడి టీచరు చిరుద్యోగం పొందారు. చిన్నారులను లాలించడం, ఆడించడం విద్యాబుద్ధులు నేర్పించడంలో శిరీషదేవి బిజీ అయ్యారు. కాలం గిరా గిరా తిరిగింది. ఎవరి జీవితం ఎపుడు మలుపు తిరుగుతుందో తెలియదు కదా. రాష్ట్రమంతా ఎన్నికల వేడి. నారా లోకేశ్ యువగళంలో నిమగ్నమయ్యారు. తన భర్త టీడీపీ నేత కావడంతో ఇద్దరూ కలసి లోకేశ్‌ని కలిశారు. రాజకీయాలపై ఉన్న ఆసక్తిని శిరీషదేవి వ్యక్తపర్చింది. ఎందుకమ్మా అని లోకేశ్ అడగడం, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికని శిరీషదేవి చెప్పడం.. అది విన్న లోకేశ్ ఓ నవ్వు నవ్వి ఊరుకోవడం. సీన్ కట్ చేస్తే.. శిరీషదేవికే పార్టీ టికెట్.. ఎన్నికల ప్రచారం, హామీలు.. అఖండ విజయం.. ఇప్పుడు శిరీషదేవి ఎమ్మెల్యే. మొన్నటికి మొన్న అసెంబ్లీ సమావేశ సమయంలో తన నియోజకవర్గపు సమస్యలు, విలీన మండలాల కష్టాలు, జీవో మూడు ఆవశ్యకతపై గళమెత్తిన తీరు శిరీషదేవికి ప్రత్యేకతను చాటాయి. ఎమ్మెల్యేగా తన తొలి వేతనంతో ప్రాథమిక ఆసుపత్రులకు ఇన్వర్టులు కొనివ్వడం, తనకున్న బొలేరు వాహనాన్ని అంబులెన్సుగా మరల్చి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయడం పేదలపై ఆమెకున్న మక్కువను స్పష్టం చేశాయి. ఏదేమైనప్పటికీ ఒక సాధారణ గృహిణిగా జీవితం మొదలు పెట్టి ఒక అంగన్వాడీగా జీవితం కొనసాగించిన మిరియాల శిరీషదేవి ఎమ్మెల్యేగా గెలిచి ఏజెన్సీ సమస్యలను పరిష్కరించడమే ప్రథమ కర్తవ్యమని శిరీషదేవి గట్టిగా చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి/చింతూరు

కౌశల్-2024 ప్రతిభాన్వేషణ పోటీలు



పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో బాషా

అమలాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నిగూఢమైన ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు కౌశల్-2024 రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పోటీలు నిర్వహిస్తారని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని డీఈవో తెలిపారు. కౌశల్ క్విజ్ జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కొంపెల్ల సుబ్బరాయశర్మ మాట్లాడుతూ ఈ పోటీలకు సంబంధించి ఒక్కో పాఠశాల నుంచి 8, 9, 10 తరగతులకు చెందిన 15మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. కౌశల్ క్విజ్‌లో ప్రిలిమినరీ పరీక్ష రాసిన తర్వాత వారు కోరుకున్న విధంగా పోస్టర్ ప్రజెంటేషన్, రీల్స్ ప్రజెంటేషన్ చేసుకోవచ్చునన్నారు. 8, 9 తరగతుల విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, 10వ తరగతి విద్యార్థులకు లఘు చిత్రాలు, రీల్స్ పోటీలు, క్విజ్ పోటీలను మాత్రం ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. పాఠశాలల నుంచి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.4,500, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, రాష్ట్రస్థాయిలో రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.9 వేలు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ కార్యదర్శి బి.హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి జి.సుబ్రహ్మణ్యం, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎన్ సూర్యనారాయణమూర్తి, విద్యార్థి విజ్ఞాన్‌మంథన్ నేషనల్ కోఆర్డినేటర్ పీవీఎల్ఎన్ శ్రీరామ్, ఎస్.బాబులు, బలభద్ర సురేష్, పాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కౌశల్-2024 పోస్టర్‌ను డీఈవో ఆవిష్కరించారు.

జిల్లా వ్యాప్తంగా గుంతలు పూడ్చే పనులు ప్రారంభం

మొత్తం 200 కి.మీ రహదారుల్లో 71 పనులకు రూ.17 కోట్లు మంజూరు

కలెక్టర్ మహేష్‌కుమార్



పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్, ఎమ్మెల్యే గిడ్డి



పి.గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ (మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ) లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న రహదారుల్లో గుంతలు పూడ్చడానికి పనులు ప్రారంభించామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. పి.గన్నవరం మండలం పోతవరంలో జరిగిన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి రోడ్డు పనులు ప్రారంభించి అనంతరం మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 200 కిలోమీటర్ల మేర రహదారుల్లో గుంతలు పూడ్చడానికి 71 పనులకుగాను రూ.17 కోట్లు మంజూరైందన్నారు. రాబోయే రోజుల్లో మరో రూ.40 కోట్లు నిధులు మంజూరు కానున్నాయని ఆయన తెలిపారు. అలాగే రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడానికి రూ.20 కోట్లు నిధులు రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారులు, పంచాయతీల పరిధిలోని గ్రామీణ రహదారులను మెరుగు పర్చడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. ప్రస్తుతానికి ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారులను అభివృద్ధి చేయడానికి నిధులు వస్తున్నాయన్నారు. రెండో దశలో పంచాయతీల పరిధిలో గల లింకు రోడ్లను సైతం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది వర్షాకాలం లోపు ఈ పనులన్నీ పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో రహదారులను పూర్తిగా విస్మరించిందని రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు రహిత రహదారులకు రూ.350 కోట్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం మండలంలోని పోతవరం నుంచి బాలాజీఫెర్రీ వరకు సుమారు 4.62 కిలోమీటర్ల మేర గుంతలు రహిత రహదారికి రూ.1.70 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, డీఈ రాజేంద్ర, టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, సర్పంచ్ వడలి కొండయ్య, బీజేపీ నాయకులు చెరుకూరి గోపాలకృష్ణమూర్తి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, చొల్లంగి సత్తిబాబు, తోలేటి సత్తిబాబు, యర్రంశెట్టి సాయిబాబు, సాధనాల శ్రీవెంకట సత్య నారాయణ, జాలెం శ్రీనివాస రాజా, యల్లమిల్లి చిట్టిబాబు, తెలగారెడ్డి కృష్ణ, మట్టపర్తి వెంక టేశ్వరరావు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదివారం ప్రత్యేకం

వర 'ప్రసాదం'

ఏదైనా ఆలయానికి దేవుడి దర్శనానికి వెళతాం. దర్శనం పూర్తయ్యాక కచ్చితంగా వెళ్లేది ప్రసాదం కోసమే. దేవుడి వర ప్రసాదంగా భావిస్తాం కాబట్టి అది అత్యంత పవిత్రమైందిగా కళ్లకు అద్దుకుని మరీ స్వీకరిస్తాం. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రముఖ ఆలయాలన్నీ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా, నియమనిష్టలతో తయారుచేస్తాయి. అందులో వాడే దినుసులు, నెయ్యి చాలా నాణ్యమైనవి వాడతారు. తయారీ విధానం కూడా అర్చక స్వాముల ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మనకు ఎన్నో విశిష్టమైన ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ప్రసాదాలకూ ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రధానంగా అన్నవరం ప్రసాదం అంటే అందరికీ చాలా ఇష్టం. ఇతర ఆలయాల్లోనూ లడ్డూలు, పులిహోర ప్రసాదాలు ఎంతో రుచిగా రూపొందిస్తారు. మన ఆలయాల్లో ప్రసాదాల ప్రత్యేకతలపై కథనం..

ఆలయాల్లో ప్రసాదాలంటే ఇష్టపడని వారుంటారా..
అన్నవరం ప్రసాదానికి అంతర్జాతీయ ఖ్యాతి
వాడపల్లి సహా ఇతర అన్ని ప్రసిద్ధ ఆలయాల్లోనూ నియమ నిష్టలతో తయారీ
ప్రసాదాల్లో రవ్వ లడ్డూలు, బూందీ లడ్డూలు, పులిహోర..
దేని ప్రత్యేకత దానిదే




అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో విక్రయించే రవ్వలడ్డూ ప్రసాదం

అమోఘం.. అయినవిల్లి రవ్వలడ్డూ

అయినవిల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయంలో 2003 నుంచి ప్రసాదాల తయారీ ప్రారంభించారు. అత్యంత రుచికరమైన ప్రసాదంగా పేరొందింది. స్వామివారి ప్రసాదాలుగా లడ్డూ, పులిహోర విక్రయిస్తున్నారు. అర్చకస్వాములే ప్రసాదం తయారుచేస్తున్నారు. రోజుకు 50 కిలోల రవ్వ, 10 కిలోల హెరిటేజ్ నెయ్యితో రవ్వ తయారీ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో 900 నుంచి వెయ్యి లడ్డూలు, పర్వదినాల్లో 3 వేల నుంచి 4 వేల వరకు విక్రయిస్తున్నారు. పులిహోర రోజుకు 40 కిలోలు, పర్వదినాల్లో 800 పులిహోర ప్యాకెట్లు, ప్యాకెట్ ఒకటి రూ.10 వంతున విక్రయిస్తున్నారు.





అమృతతుల్యం.. అన్నవరం ప్రసాదం

అన్నవరం అనగానే గుర్తొచ్చేది సత్యదేవుడి గోధుమరవ్వ ప్రసాదం. ఇది ఎంతో అమృతతుల్యంగా ఉండడం, విస్తరాకులో అందించడంతో అన్నవరం సామి ప్రసాదం ఆకుతో నాకేయాలి అంటూ చలోక్తులు విసురుతుంటారు. అన్నవరంలో గోధుమరవ్వ ప్రసాదం ఎందుకు తయారుచేస్తారో పురాణ కథ ప్రచారంలో ఉంది. స్కాంద పురాణంలో శూతమహాముని శౌనికాది మునులకు దీని గురించి వివరిస్తారట. గోధుమరవ్వ, పాలు, ఆవునెయ్యి, పంచదార, సుగంధ ద్రవ్యాలతో తయారుచేసి సత్యదేవుడికి నైవేద్యం సమర్పించి ప్రసాదంగా తీసుకోవాలని చెబుతారు. 1891లో సత్యదేవుడి ఆలయం ఆవిర్భావం జరిగింది. అప్పటినుంచి స్వామివారి ఆలయంలో గోధుమరవ్వ ప్రసాదం భక్తులకు అందిస్తున్నారు. ఏటా రెండు కోట్ల ప్యాకెట్లను భక్తులకు విక్రయిస్తుంటారు. ఏ ఆలయంలో అయినా పులిహోర, లడ్డూ ప్రసాదంగా ఉండగా దేశవ్యాప్తంగా అన్నవరం ఆలయంలోనే గోధుమరవ్వ ప్రసాదంగా అందిస్తారు. స్వచ్ఛమైన వేడినీటిలో గోధుమరవ్వను ఉడికించి, ఆవునెయ్యి, పంచదార, సుగంధ ద్రవ్యాలతో వీటిని వంటస్వాములు తయారుచేస్తారు. ఈ ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లభించింది.

బంగీప్రసాదం: సత్యదేవుడి ఆలయంలో గోధుమరవ్వ ప్రసాదంతోపాటు బంగీప్రసాదం విక్రయిస్తారు. కరాచీ రవ్వతో తయారుచేసే ప్రసాదంలో జీడిపప్పు, కిస్‌మిస్ కూడా వేస్తారు. వారం వరకు నిల్వ ఉండడంతో దూర ప్రాంతాలు ప్రయాణించే భక్తులు వీటిని తీసుకెళతారు. ఏటా సుమారు 20 లక్షల బంగీప్రసాదం ప్యాకెట్లను విక్రయిస్తారు. ఇక ప్రసాద విక్రయాల ద్వారా రూ.40 కోట్లు గోధుమరవ్వ ద్వారానూ, బంగీ ప్రసాదం ద్వారా రూ.10 కోట్లు లభిస్తోంది.

- ఆంధ్రజ్యోతి/అన్నవరం



బంగీ ప్రసాదం





ప్రీతికరం.. అంతర్వేది స్వామివారి లడ్డూ

అంతర్వేది నవంబరు 2: దక్షిణకాశీగా పేరొందిన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ప్రతి ఇంట ఇలవేల్పుగా భావిస్తూ పశ్చిమ ముఖంగా దర్శనమిస్తారు. కొన్నిసంవత్సరాలుగా ఎంతో ప్రీతికరమైన స్వామివారి లడ్డూను భక్తులు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తారు. ఒక లడ్డూ ధర రూ.15. ఆలయంలోనే సిబ్బందితో ఈ లడ్డూ తయారుచేస్తారు. ఒక పాకానికి సుమారు 500 లడ్డూలు దాటి తయారవుతాయి. దసరా, కార్తీకమాసం, సంక్రాంతి పర్వదినాలతోపాటు విశేషమైన రోజుల్లో భక్తులు ఎక్కువగా లడ్డూను కొనుగోలు చేస్తారు. లడ్డూ తయారీకి శనగపప్పును ఆలయంలోనే మిల్లింగ్ చేసి పిండి ఆడతారు. విశాఖ డెయిరీ నెయ్యిని, టెండరు ప్రక్రియ ద్వారా కిరాణా సరుకులు లడ్డూ తయారీలో వినియోగిస్తారు.



మురమళ్లలో కల్యాణం లడ్డూలు ఉచితంగా..

ఐ.పోలవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామి నిత్యకల్యాణోత్సవాలు జరుగుతాయని తెలిసిందే. ఇక్కడ కల్యాణం సందర్భంగా ఉచితంగా లడ్డూలు ఇస్తారు. సుదీర్ఘకాలం అనుభవం ఉన్న వంటస్వామి విశ్వనాథ సత్యనారాయణ ప్రసాదం తయారు చేస్తారు. 1982 నుంచి 2012 వరకు విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఆయన పనిచేశారు. లడ్డూ తయారీ శనగపిండి, పంచదార, నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, యాలకులు, కర్పూరం, జాజికాయ వినియోగిస్తారు. కళ్యాణం భక్తులకు 180గ్రా.ల లడ్డూ ఉచితంగా ఇస్తారు. సాధారణ భక్తులకు 80గ్రా.ల లడ్డూ పది రూపాయలకు అందజేస్తారు. పులిహోర ఇక్కడ ప్రత్యేక రుచితో ఉండడం విశేషం.



వెంకన్న లడ్డూ.. భలే రుచి

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు వేలాదిగా వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. ఈ క్షేత్రంలో స్వామివారి లడ్డూ ఎంతో ప్రాచుర్యం పొందింది. 2007 నుంచి ఆలయంలోనే స్వామివారి లడ్డూను తయారుచేస్తున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ప్రసాదశాలను నిర్మించారు. కొయంబత్తూరు నుంచి లడ్డూ తయారీకి ప్రత్యేక మిషనరీ తీసుకువచ్చి గ్యాస్ ద్వారా స్వామివారి ప్రసాదం నియమనిబంధనలతో తయారుచేస్తున్నారు. తిరుపతి తరహాలో స్వామివారి లడ్డూను తయారు చేయడం గమనార్హం. ప్రతిరోజూ 31 మంది సిబ్బంది స్వామివారి లడ్డూ తయారీలో నిమగ్నమవుతున్నారు. నెలకు 2.51 లక్షల లడ్డూను తయారు చేస్తూ ఒక్కొక్క లడ్డూ రూ.15కు విక్రయిస్తున్నారు. పచ్చకర్పూరం, జాజికాయ, యాలికలు, కిస్మిస్, జీడిపప్పు, హెరిటేజ్ నెయ్యి, శెనగపిండి, పంచదారతో స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నారు.



వాడపల్లిలో తయారైన బూంది లడ్డూలు.. తయారు చేస్తున్న దృశ్యం





భీమేశ్వరుని ప్రసాదం.. అద్భుతం

ద్రాక్షారామ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రాచీన శైవక్షేత్రం.. పంచారామం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ప్రసాదం తయారీ విక్రయాలు 33 ఏళ్ల కిందట ప్రారంభించారు. పులిహోర, రవ్వలడ్డూ, బూంది లడ్డూ ప్రసాదాలు భక్తులకు అందుబాటులో ఉంటాయి. తొలుత బయట వంట బ్రాహ్మణులకు తయారీ అవకాశం ఇచ్చేవారు. తర్వాత ఆలయ బేడా మండపంలో పాకశాలలో తయారుచేసేవారు. ప్రస్తుతం అన్నప్రసాద భవనం అందుబాటులోకి రావడంతో ప్రసాదాల తయారీ అక్కడే చేస్తున్నారు. బూంది లడ్డూ తయారీకి శనగపిండి, పంచదార, జీడిపప్పు, కిస్‌మిస్‌లు, యాలకులు, ఆవునెయ్యి, పచ్చకర్పూరం, సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతారు. రవ్వలడ్డూ తయారీకి పంచదార, ఆవునెయ్యి, యాలకులు, కరాచీరవ్వ, జీడిపప్పు, కిస్‌మిస్ వాడుతారు. పులిహోర తయారీ కూడా ప్రత్యేకం. నాణ్యమైన దినుసులే వాడతారు. ప్రసాదాలను ఆలయంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు జరుపుతారు. 2023-2024 ఏడాదిలో ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.44,39,365 సమకూరింది. ప్రసాదాలు తయారీకి రూ.31,00,391 ఖర్చుచేశారు.

పాదగయ రవ్వలడ్డూ.. ఉత్తరాదికి ప్రీతి

పిఠాపురం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో రవ్వ లడ్డూ ప్రసాదానికి విశిష్టత ఉంది. ఉత్తరాది రాష్ట్రాల భక్తులు ఎక్కువగా ప్రసాదాన్ని కొనుగోలు చేస్తూ ఉంటారు. పులిహోర ప్రసాదం కూడా ఇక్కడ అందుబాటులో ఉంటుంది. పాదగయలో స్వయంభువు కుక్కుటేశ్వరస్వామి, ఆదిశంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవారు, స్వయంభువు దత్తాత్రేయస్వామి దర్శనాలకు ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు ఉత్తరాది రాష్ట్రాలు, ఒడిశా, కర్నాటక, గోవా, పశ్చిమ బెంగాల్‌నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. ఇక్కడకు వచ్చిన భక్తులు దర్శనాల తర్వాత తప్పనిసరిగా ఇక్కడ లభించే రవ్వ లడ్డూ ప్రసాదాన్ని తీసుకుంటారు. మిగిలిన దేవస్థానాలకు భిన్నంగా ఈ రవ్వ లడ్డూ ఉంటుంది. కరాచి నూక, పంచదార, నెయ్యి, కిస్‌మిస్, యాలకులు వినియోగిస్తారు. పాలు వాడరు. ఒక్కో రవ్వలడ్డూ ప్రసాదాన్ని రూ.15కి విక్రయిస్తున్నారు. పులిహోర ప్రసాదం రూ.10కి విక్రయిస్తారు. మహాశివరాత్రి, శరన్నవరాత్రులు, కార్తీక, శ్రావణమాసాలు వంటి పర్వదినాల్లో రవ్వలడ్డూ ప్రసాదాలకు అధిక డిమాండ్ ఉంటుందని ఈవో జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు.

బాలబాలాజీ లడ్డూ.. ఆహా ఏమి రుచి

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీ తీరంలో బాలతిరుపతిగా వర్ధిల్లుతున్న అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని భక్తులు పవిత్రంగా భావిస్తారు. మొదట్లో ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి బూరి, పులిహోర ప్రసాదంగా అందించేవారు. 1981 సంవత్సరంలో ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. స్వచ్ఛమైన నెయ్యితో 80 గ్రాముల బరువుగల లడ్డూను రూ.15కి విక్రయిస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యితో తయారు ఈ లడ్డూను భక్తులు ఇష్టంగా తింటారు.



పంచారామ.. ప్రసాదం

సామర్లకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో కరాచీ (తెల్లనూక) నూక లడ్డూను విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ పులిహోర ప్రసాదంతోపాటు కరాచీ నూక లడ్డూలు కూడా ఆలయం వద్ద భక్తులకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆలయంలోనే తయారుచేస్తున్నారు.

రేపటి నుంచి డిప్యూటీ సీఎం పవన్ పర్యటన

మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ వచ్చే అవకాశం

ఏర్పాట్లు పరిశీలించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటించే ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ 4, 5 తేదీల్లో కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనకు రాష్ట్ర మునిసిపల్‌శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ వచ్చే అవకాశాలు ఉన్నాయి. డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాలను కాకినాడ జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ పరిశీలించారు. సభ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో కర్రి స్వప్న, నగర పంచాయతీ కమిషనరు రవికుమార్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో రెండురోజుల పాటు డిప్యూటీ సీఎం పవన్ పర్యటించనున్నారు. సోమవారం 10 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి 11.30 గంటలకు గొల్లప్రోలు చేరుకుంటారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి పలు ప్రారంభోత్సవాలు చేస్తారు. సాయంత్రం కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలో ఏపీఎస్‌డ బ్లూఆర్‌ఈఐ ఇనిస్టిట్యూట్‌ను సందర్శిస్తారు. రాత్రి గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బస చేస్తారు. కొత్తపల్లిలో 5న పలు శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళతారు. కాగా 4వ తేదీ పవన్‌కల్యాణ్ పర్యటనలో మంత్రి నారాయణ కూడా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారుడు



కాకినాడ డీఎస్ఏ మైదానంలో వివిధ పోటీల ఎంపికకు హాజరైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికలు

కాకినాడ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యే జిల్లాస్థాయి క్రీడాకారులను కాకినాడ డీఎస్ఏ మైదానంలో శనివారం ఎంపిక చేశారు. పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి ఎంపికలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు బేస్‌బాల్, జిమ్నాస్టిక్స్, మోడరన్ పెంటతలాన్, రోల్‌బాల్‌ల్లో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని జార్జి తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో చిత్తూరులో జరిగే అండర్-14 బేస్‌బాల్, అండర్-17 విభాగం గుంటూరులో నిర్వహిస్తారన్నారు. మోడరన్ పెంటతలాన్‌లో 9, 10 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహిస్తారన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో జిమ్నాస్టిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతాయన్నారు.

ఘనంగా టీఎన్ఏఐ ద్వైవార్షిక సమావేశం

- నర్సింగ్‌లో నాయకత్వ లక్షణాలపై అవగాహన
- హాజరైన 2500 మంది నర్సింగ్ విద్యార్థులు
- ముఖ్య అతిథిగా ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ నరసింహం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ నరసింహం తదితరులు

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ వివేకానంద పార్కు ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో శనివారం 78వ ది ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ ద్వైవార్షిక సమావేశం జరిగింది. సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 2,500 మంది నర్సింగ్ విద్యార్థులు హాజరయ్యారు. టీఎన్ఏఐ, ఆర్ఎంసీ నర్సింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో సీఆర్ సంసీర్ బేగం, సంఘ కార్యదర్శి, ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల పర్యవేక్షణలో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. అతిథిగా ఐఆర్‌సీ వ్యవస్థాపకుడు విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ చక్రధర్ హాజరయ్యారు. ప్రధాన అజెండా లీడర్‌షిప్ ఇన్ నర్సింగ్ ఇన్‌స్పైరింగ్ విజన్ డ్రైవింగ్ చేంజస్ అంశంపై సమావేశం జరిగింది. సదస్సులో డాక్టర్ నరసింహం మాట్లాడుతూ నర్సింగ్ విద్యలోకి అడుగుపెట్టారంటే కచ్చితంగా వారికి సేవా భావం ఉన్న వ్యక్తులై ఉంటారన్నారు. ఈ వృత్తి కన్నా వేరే వృత్తుల్లో జీతభత్యాలు అధికంగా ఉన్నా నర్సింగ్ వైపు మొగ్గు చూపారంటే వారి సేవా గుణం కొనియాడదగిందన్నారు. నర్సింగ్ రంగంలో మారుతున్న ఆధునికతను అందిపుచ్చుకుని నర్సింగ్ వృత్తికి వన్నె తేవాలన్నారు. సదస్సులో ఏపీడీఎంఈ కార్యాలయ నర్సింగ్ డీడీ ఎస్.జ్యోతి, ఆర్ఎంసీ నర్సింగ్ ప్రిన్సిపాల్ ఎం.మునిరత్నమ్మ హాజరయ్యారు. సదస్సులో భాగంగా సైంటిఫిక్ పేపరు ప్రజెంటేషన్ చేపట్టారు. ప్లీనరీ సెషన్స్‌లో నర్సింగ్ ప్రాధాన్యాన్ని వివరించి ఇటీవల జరిగిన అధునాతన మార్పులను ప్రస్తావించారు.

ముగిసిన ఉమ్మడి తూర్పుగోదావరి క్రీడాకారుల ఎంపిక

తొండంగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో రోప్ స్కిప్పింగ్, మాల్కమ్ క్రీడల్లో రాష్ట్ర ఈవెంట్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక శనివారం పూర్తయ్యింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం రావికంపాడు ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలో 20 పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు విభాగాల్లోను అండర్ 14, 17లలో బాలబాలికలు హాజరయ్యారు. మాల్కమ్ అండర్ 14 బాలికల విభాగంలో కర్రి దేవి, కోశెట్టి దీప్తి, బత్తిన మురారి దివ్య, దంగా భారతి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో కోశెట్టి తనూజ్, ఆర్.సూర్య, ఎ.సంతోష్‌కుమార్, జి.రాహుల్, కె.శర్విన్‌బాబు, సీహెచ్ వరుణ్‌తేజ ఎంపికయ్యారు. రోప్ స్కిప్పింగ్‌లో కె.తనూజ్, ఆర్.సూర్య, కె.బాబు, సీహెచ్ కల్యాణ్‌రావు దొర, వరుణ్ తేజ దొర, ఎస్.సుజన్, ఎం.మౌళి, కె.శర్విన్ బాబులు ఎంపికయ్యారు. వారంతా ఈనెల 8 నుంచి 10 వరకు భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారు. వివిధ పాఠశాలల పీడీలు క్రీడా నిర్వహణ నిమిత్తం హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ప్రసాదరావు, పీడీ కె.నర్సింహమూర్తి, విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు

పాపికొండలకు పర్యాటకుల సందడి


పాపికొండల విహారయాత్రకు వెళుతున్న బోటు

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో పాపికొండలు అందాలు తిలకించేందుకు పర్యాటకులు శనివారం గోదావరి ముంపు పరివాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా మండలంలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 250 మంది పాపికొండలు వెళ్లారు. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని బోట్లలో తరలివెళ్లారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కోనసీమవాసులు



అమలాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరిని నియమించారు. కొంకాపల్లికి చెందిన బ్యాడ్మింటన్ గ్రేడ్-1 నేషనల్ అంపైర్ పాయసం శ్రీనివాసరావు, కామనగరువు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీగా పనిచేస్తున్న గొలకోటి శ్రీనివాస్‌ను ప్రతిష్ఠాత్మకమైన కొటాక్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతలుగా నియమించారు. ఈనెల 5 నుంచి హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈ పోటీలు జరుగుతాయి. శ్రీనివాసరావులను అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌తోపాటు కొత్తపల్లి బాబు, కోనసీమశాఖ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, శరత్‌బాబు, కాశీవిశ్వనాథం, బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, పల్లంరాజు అభినందించారు.

శివోహం!

- పాడ్యమి దీపాలు వదిలిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో కార్తీక స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, గోదావరిలో అరటిదొప్పల్లో దీపాలు వదులుతున్న భక్తురాలు

ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో కార్తీకమాసం తొలిరోజున శైవక్షేత్రాలు కార్తీకమాస శోభ చేకూరింది. .కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం తెల్లవారుజామున రెండు గంటలకే భక్తుల రాక ప్రారంభమైంది. రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవు, కోటిలింగాల రేవు, దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం, ద్రాక్షారామ భీమేశ్వరాలయంవద్ద పుష్కరిణి, కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం, సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయాల వద్ద భక్తులతో కిక్కిరిశాయి. కార్తీకమాసానికి ప్రారంభ సూచకంగా భక్తులు అరటిదొప్పల్లో పాడ్యమి దీపాలు వెలిగించి వదిలారు.


పిఠాపురం పాదగయ పుష్కరిణిలో అరటిదొప్పలో పాడ్యమి దీపాలు వెలిగించి వదులుతున్న భక్తులు, పూజలు చేస్తున్న మహిళలు

రత్నగిరిపై కార్తీక సందడి

- సత్యదేవుడికి కార్తీకమాస తొలిరోజు ఆదాయం రూ.40 లక్షలు
- ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఈవో రామచంద్రమోహన్


రత్నగిరి కొండపై వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస సందడి ప్రారంభమైంది. తొలిరోజు సుమారు 50 వేలమంది భక్తులు దర్శించుకోగా రూ.40లక్షల ఆదాయం లభించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని 4 గంటల నుంచి స్వామివారి వ్రతాలు, దర్శనాలు ప్రారంబించారు. 2952 జంటలు సత్యదేవుడి వ్రతాలాచరించారు. ఈవో రామచంద్రమోహన్ క్షేత్రస్థాయిలో వ్రతమండపాలు, క్యూలైన్‌లను ప్రారంబించారు. ప్రధానాలయం వద్ద అదనంగా 1200 మంది భక్తులకు సౌకర్యవంతంగా ఉండే క్యూలైన్‌ను, సిట్టింగ్, ప్యాన్లు ఏర్పాటుచేసిన క్యూలైన్‌లను పరిశీలించారు. పశ్చిమరాజగోపురం వద్ద ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి శనివారం అన్నవరం గ్రామానికి చెందిన వీర్ల సత్యసాయితేజ తన మొదటినెల జీతానికి సత్యదేవుడికి సమర్పిస్తానని మొక్కుకోవడంతో రూ.లక్ష విరాళంగా ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. దాతను ఆయన అభినందించారు.

సమాచార కమిషనర్ పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం సమాచార కమిషనర్ ఉదయభాస్కరరెడ్డి స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

ప్రాకారసేవ, రథోత్సవం సాయంత్రానికి మార్పు

సత్యదేవుడి సన్నిధిలో ఉదయం సమయంలో ప్రతి శనివారం నిర్వహించే ప్రాకారసేవ, ఆదివారం నిర్వహించే ఆర్జితసేవ రథోత్సవం కార్తీక మాసం నెలరోజులు భక్తుల రద్దీదృష్ట్యా సాయంత్రం 4.30కి నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. కార్తీకమాసం అనంతరం ఈసేవలు యథావిధిగా ఉదయం జరుగుతాయని రథపాత్‌లో భక్తుల సంచారం శని, ఆదివారాల్లో అధికంగా ఉండడంతో పండితులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

గోవిందా..హరి గోవిందా!

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.45.33లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి


వాడపల్లి వెంకన్న ఆలయంవద్ద బారులుతీరిన భక్తులు


బాలబాలాజీకి పూజలు చేస్తున్న అర్చకుడు


తిరుపతి శృంగారవల్లభస్వామి

ఆత్రేయపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు గోవిందనామస్మరణతో స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. స్వామివారి ఆలయంలో రామానుజ తిరునక్షత్ర ఉత్సవాలు రెండోరోజు నిర్వహించారు. ప్రకారోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. వివిధసేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.45.33లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

శృంగారవల్లభస్వామికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 2,81,730, అన్నదాన విరాళాలు రూ.74,221 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,480, తులాభారం, కానుకలు ద్వారా రూ.350, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.23,160 వెరసి రూ.3,84,941 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకస్వాములు విశేష పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. కార్తీకమాసం ప్రారంభంకావడంతో వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారికి శనివారం సుప్రభాత సేవ, తొలిహారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిపారు. నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించేందుకు భక్తులు బారులు తీరారు. శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,53,765 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5,540మంది భక్తులు దర్శించుకుని 3386 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

చిక్కని పులి

- పట్టు రైతులకు అపార నష్టం
- పంటను వదిలేస్తున్న గిరిజనులు


పట్టుపురుగులు చూపుతున్న తెల్లం గోపయ్య, శాంతమ్మ దంపతులు

కూనవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మన్యంలో పులి సంచారం గిరిజన రైతులకు నష్టం వాటిల్లేలా చేస్తోంది. ప్రతీ ఏడాది గిరిజనులు అడవిలో పట్టుపురుగులు సాగు చేస్తుంటారు. అందులో భాగంగానే ఈఏడాది కూడా స్థానిక గిరిజనులు అడవిలో సాగు చేస్తున్నారు. మొత్తం 3 దఫాలుగా పట్టు పురుగులు సాగు చేస్తారు. ప్రతీ పట్టుపురుగుల సాగుకు రూ.20 వేల నుంచి రూ.30వేలు సంపాదిస్తారు. ఇప్పటికే గిరిజనులు తొలి పంట పూర్తిచేసుకుని రెండోపంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రెండో పంట పురుగుదశలో ఉంది. ఈ దశలో ప్రతీరోజూ వెళ్లి పురుగులు పిట్టలుబారిన పడకుండా చూడాలి. పులి సంచార భయంతో అడవిలోకి వెళ్లాలంటేనే గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. అందులో భాగంగానే గిన్నెలగూడెంకు చెందిన కొంతమంది గిరిజన రైతు లు మండలంలోని దట్టమైన అడవిలో ఈ టసార్ పట్టు పురుగుల పంటను సాగు చేస్తున్నారు. అయితే అడవిలోకి వెళ్లలేక ఆ పంటను వారు సాగు చేయడం మానేశారు. దీంతో ఒక్కొక్కరికీ రూ.30వేలు వరకు నష్టం వాటిల్లింది. మరికొంతమంది రోడ్డు పక్కన అడవుల్లో ఈ పట్టుపురుగు పంటను సాగు చేస్తున్నారు. గతంలో ఒక్కొక్కరే వెళ్లి పంట సాగు చేసుకు నే వారు. కానీ ఈసారి గుంపులు, గుంపులుగా వెళ్లి పంటను సాగు చేసుకుని ఇంటికి వస్తున్నారు. ఆర్థికంగా నష్టపోయిన తమకు ప్రభుత్వం సాయం చేయాలని పలువురు గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భగవాన్‌పురంలో పట్టుపురుగుల పంటను సాగుచేస్తున్న సుధాకర్ అనే వ్యక్తి అడవిలోకి వెళ్లగా పులి కనిపించడంతో ఒక్కసారిగా ఆ వ్యక్తి పట్టుపురుగుల పంటకు వెళ్లడానికి భయపడుతున్నాడు.

కొనసాగుతున్న పులి అలజడి

కూనవరం మన్యంలో పులి అలజడి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే తమకు కళ్లెదుటే పులి కనిపించిందంటూ పలువురు గిరిజనులు తెలుపుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారికి సైతం రోడ్డుకు అడ్డంగా పడుకుని ఉండడంతో భయాందోళనకు చెందినట్లు బోదునూరు వాసులు తెలిపారు. కూనవరం అడవుల్లో ఆది నుంచి పులి అలజడి కొనసాగుతూనే ఉంది. 60 సంవత్సరాల క్రితం మండలంలోని చిన్నబోయిన కన్నయ్య మేకలు తోలుతూ ఉండగా అతనిపై అప్పట్లో చిరుతపులి దాడి చేసింది. అదేవిధంగా పదేళ్ల క్రితం వీఆర్‌పురం మండలంలో బూరుగువాడ గ్రామంలో ఒకేరోజు 15 ఎద్దులపై దాడిచేసిన సంఘటన జరిగింది. 2010లో రామచంద్రాపురం అడవుల్లో ఓ పశువుపై దాడిచేసినట్లు ప్రచారం జరిగింది. మరలా ఇప్పుడు పులి పశువులపై దాడిచేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పట్టు పురుగులు సాగు చేయాలంటే భయమేస్తోంది

● తెల్లం గోపయ్య

అడవిలోకి వెళ్లి పట్టుపురుగులు సాగు చేయాలంటే భయమేస్తుంది. గతంలో ఒక్కరమే వెళ్లి సాగు చేసేవాళ్లం. ఇప్పుడు పులి భయంతో కుటుంబం మొత్తం వెళ్లి పట్టుపురుగుల పంట సాగు చేయాల్సి వస్తోంది. మరికొంతమంది పంట సాగు చేయలేక అడవిలోనే వదిలేశారు.

మేలు జరిగేలా నూతన కౌలు చట్టం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్


కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

అమలాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ యజమానులకు ఇబ్బంది లేకుండా కౌలు రైతులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తీసుకువస్తున్నట్టు వ్యవసాయ, సెరీకల్చర్, మార్కెటింగ్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 80శాతం భూములను కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వపరంగా అందాల్సిన బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు కౌలు రైతులకు అందడం లేదన్నారు. భూ యజమానులకు సీసీఆర్సీ కార్డుల మీద అపోహలు ఉండడంవల్ల ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరుకాకపోవడంతో బ్యాంకుల్లో వారికి పంట రుణాలు కూడా లభించడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం భూ యజమానులకు భరోసా కల్పిస్తూ కౌలుదారులకు పంట రుణాలు అందేలా నూతన సాగుదారుల హక్కుచట్టం-2024ను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ఇప్పటికే ముసాయిదాను రూపొందిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి భూ యజమానులు, కౌలుదారులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్టు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాల వారీగా పర్యటనలు చేస్తున్నామన్నారు. అమలాపురం కలెక్టరేట్‌లో శనివారం కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన భూ యజమానులు, కౌలుదారులతో నిర్వహించిన ప్రాంతీయ సమావేశాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. రాష్ట్రంలో అమలవుతున్న కౌలు చట్టాలను రైతులకు ఆయన వివరించారు. 2019 సీసీఆర్సీ చట్ట ప్రకారం కౌలుదారులకు భూ యజమానుల అనుమతితో పదకొండు నెలల కాలపరిమితికి సీసీఆర్సీ కార్డులను రెవెన్యూశాఖ జారీ చేస్తుందన్నారు. అయితే ఈ చట్టంలోని లోపాల వల్ల ఎక్కువ మంది కౌలు రైతులు పంట రుణాలు పొందడంలేదని ప్రభుత్వం గ్రహించిందన్నారు. కౌలు రైతుల సమస్యలు గ్రహించడానికి నూతన చట్టం తీసుకువస్తున్నట్టు తెలిపారు. కొత్త చట్టంలో సీసీఆర్సీ కార్డు జారీ చేసేటప్పుడు భూ యజమాని సిఫార్సు అవసరం లేదన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించుకుని కౌలు రైతులకు కార్డులు జారీ చేయడంతోపాటు రుణాలు మంజూరుచేసే పలు అంశాలను వివరించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు అనేకపథకాలు అందేలా నూతన చట్టాన్ని రూపొందించేలా ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ఎమ్మెల్సీలు ఐల్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, జిల్లా వ్యవసాయాధికారులు వి.బోసుబాబు, ఎన్.విజయ్‌కుమార్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతి సమైక్యత చాటేందుకే వన సమారాధనలు

- కార్మికశాఖా మంత్రి సుభాష్

కాకినాడ సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతి సమైక్యతను చాటుకునేందుకు వన సమారాధనలు దోహదపడతాయని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామారావుపేట శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 17న జరుగనున్న శెట్టిబలిజ వన సమారాధన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మం త్రి సుభాష్ మాట్లాడుతూ ఒకేచోట అందరూ కలిసి ఐక్యతను చాటి చెప్పడమే ధ్యేయంగా వనసమారాధన జరగాలన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ శెట్టిబలిజ వర్గానికి చెందిన ప్రజలు సామాజిక వెనుకబాటులో ఉన్నారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, బీసీ నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, చొల్లంగి వేణుగోపాల్, పెంకే శ్రీనివసబాబా, వాసంశెట్టి రాజేశ్వరావు,కుడుపూడి సత్తిబాబు, గుత్తుల శ్రీను, వాసం శెట్టి అంజిబాబు పాల్గొన్నారు.


వనసమారాధన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

6వతేదీతో ముగుస్తున్న ఓటు నమోదు

- పట్టభద్రులు ఓటు నమోదుకు అవకాశం
- ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 81213

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రులు నియోజకవర్గం ఓటర్లు జాబితా నమోదు ఈనెల 6వతేదీతో ముగుస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంక ట్రావు తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు పట్టభద్రులుఓటుకోసం 81,213 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా 988, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 15987, తూర్పుగోదావరిజిల్లా 13836, ఏలూరు జిల్లా 14557, కాకినాడ జిల్లా 15183, పశ్చిమగోదావరి జిల్లా 20662 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

కన్నీరు మున్నీరుగా..

- శలపాకలో హత్యకు గురైన మృతులకు అంత్యక్రియలు పూర్తి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబీకులు, బంధువులు
- గ్రామంలో కొనసాగుతున్న 144సెక్షన్, పోలీస్ పికెటింగ్


రోదిస్తోన్న బత్తుల చిన్నయ్య కూతురు రాణి


విషాదంలో బత్తులరాజు భార్య లక్ష్మీ, కూతురు రాజేశ్వరి


ఆరునెలల చంటిబిడ్డతో విషాదంలో రమేష్ భార్య

కాకినాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక హత్యలతో గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. అల్లర్లు జరగకుండా విధించిన 144సెక్షన్‌ను మరికొన్ని రోజులు పొడిగించారు. కాగా హత్యకు గురైన బత్తుల చిన్నయ్య(42), బత్తుల రాజు(40), చిన్నయ్య కొడుకు బత్తుల రమేష్ (25)కు కాకినాడ జీజీహెచ్‌లో శనివారం మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తయింది. దీంతో మృతదేహాలను శలపాకకు తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. పొట్టకూటికోసం కువైట్ వెళ్లి అక్కడ పనిచేస్తున్న చిన్నయ్య, రాజుల భార్యలు అనసూయ, లక్ష్మీ తమ భర్తల హత్య గురించి తెలియడంతో హుటాహుటిన కువైట్ నుంచి బయలుదేరి గ్రామానికి వచ్చారు. కుటుంబం బాగు.కోసం తాము విదేశాలకు వెళ్లి ఉపాధి పొందుతుంటే తమ మగవాళ్లు హత్యకు గురవడంతో వీరిద్దరూ కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను చూసి బోరున విలపించారు. ఎంత ఘోరం జరిగిపోయింది. కనీసం గ్రామంలో ఎవరూ ఆపేవారే లేరా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాల వద్ద కూర్చుని వీరిద్దరూ విలపిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. చిన్నయ్య కూతురు, కొడుకు అయితే విగత జీవిగా పడి ఉన్న తండ్రిని చూసి గుండెలు బాదుకుని రోదించారు. బత్తుల రాజు కుమారుడు సూర్య అయితే విగతజీవిగా పడి ఉన్న తండ్రిని చూసి కన్నీరు మున్నీరుగా విలపించాడు. తామంతా కుటుంబం కోసం వేరే దేశాల్లో ఉండి పనిచేస్తున్నామని, తండ్రి గ్రామంలో క్షేమంగానే ఉన్నాడనుకుంటే ఇంత దారుణంగా హత్య చేస్తారా అంటూ రోదించాడు. మృతదేహాలను కొంతసేపు నివాసంవద్ద బంధువుల పరామర్శకు ఉంచగా వారి రోదనలు మిన్నంటాయి. బత్తుల రమేష్ హత్యకు గురవడంతో ఆరునెలల చంటిబిడ్డ అనాథగా మారడంతో తల్లి విలపిస్తూనే ఉంది. తనకు, బిడ్డకు దిక్కెవరంటూ రోదిస్తోంది. ఇంత చిన్న వయసులో తండ్రిని కోల్పోయిన బిడ్డకు రేప్పొద్దున ఏం చెప్పాలని, తామెలా బతకా లంటూ బోరున విలపిస్తోంది. హత్యకు పాల్పడిన ఐదుగురు నిందితుల్లో ఇప్పటికే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు ఇంకా పరారీలోనే ఉండడంతో వారికోసం గాలిస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే చర్యలు

అంబాజీపేట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద దూమపానం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.చిరంజీవి అన్నారు.జిల్లా టుబాకోకంట్రోల్ ప్రోగ్రాంకౌన్సిలర్ ప్రమీళ ఆధ్వర్యంలో పొగాకు వల్ల కలిగే నష్టాలు వివరించారు. హెచ్‌సీ వీఎస్ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

అంబాజీపేట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు పరిధిలోని మెట్ల కాలనీలో పలు రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు చెప్పారు. మెట్లకాలనీలో రూ.20లక్షలతో సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు చెప్పారు. దూనబోయిన బాబి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇమ్రాన్, మల్లాది బాబి పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్ల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం



మామిడికుదురు: రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు లేని రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మామిడికుదురు నుంచి గోగన్నమఠం వరకు నిర్మించే ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శనివారం మామిడికుదురులో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఏడున్నర కిలోమీటర్ల మేర రూ.2.10కోట్లతో ఈరోడ్డును నిర్మిస్తున్నారు. గ్రామంలో డ్రెయిన్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయిన్ ఏర్పాటుచేయాలని స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్‌తో పాటు స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఆయా పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ జడ్పీటీసీ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, గుండుబోగుల పెదకాపు, మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, బోనం బాబు, వర్ధినేని బాబ్జి, నామన నాగేశ్వరరావు, వాసంశెట్టి వెంకట్రావు, బొలిశెట్టి జయరామ్, రుద్ర శ్రీను, యింటి మహేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రోడ్ల అభివృద్ధి

అల్లవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పాలనలో గుంతలు లేకుండా రోడ్ల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. రూ.40లక్షలతో దేవగుప్తం-గుండెపూడి ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకట్రావు, టీడీపీ నాయకులు వేగిరాజు వెంకట్రాజు, ఆకుల లక్ష్మణరావు, కేవీ, పోతుల నాగరాజు, గుబ్బల నాగేశ్వరరావు, కొప్పిశెట్టి రామకృష్ణ, నార్ల శ్రీనివాస్, బొర్రా రాజేష్, పచ్చిమాల ఏడుకొండలు, ఎంపీటీసీలు ఎం.రాంబాబు, మాకే కృష్ణమూర్తి, ఏఈ అంబేడ్కర్ పాల్గొన్నారు.

రూ.3.21కోట్లతో రోడ్ల ఆధునికీకరణ

ఐ.పోలవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక రూపొందించారనిఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. శనివారం ఐ.పోలవరంలో ఆయన రోడ్డు ఆధునీకరణకు భూమిపూజ చేశారు. రూ.860కోట్లతో రాష్ట్రంలో రోడ్ల గుంతలు పూడ్చడానికి శ్రీకారం చుట్టారన్నారు.నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మత్తులకు రూ.3.21కోట్లు మంజూరైనట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపరెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, చెల్లి అశోక్, కాకర్లపూడి రాజేష్, పిన్నమరాజు శివరాజు, బొంతు సత్యప్రసాద్, పిల్లా గోపి, మల్లిపూడి రాజా, దేవు రాంబాబు, మద్దిరెడ్డి కుమార్ పాల్గొన్నారు.

కార్తీక మాసం ప్రారంభం







బండారులంక త్రయంబకేశ్వరస్వామి ఆలయం వద్ద ఆకాశదీపం ఏర్పాటు, ముమ్మిడివరం: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, కాట్రేనికోన: కుందలేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

అమలాపురంరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్ విగ్రహాలకు నూతన వస్త్రాలంకరణతో పాటు శనివారం వైభవంగా పుష్పాలంకరణ నిర్వహించారు. ఆలయంలోని సిద్ధి వినాయకునికి అష్టద్రవ్య అభిషేకాలు నిర్వహించిన అనంతరం నూతన వస్త్రాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలోని మూలవిరాట్ విగ్రహాలకు, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వస్త్రాలంకరణ జరిపారు. ఆలయ పురోహితుడు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో జరిగిన కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, ఆలయ ధర్మకర్త పిచ్చిక వెంకన్న, చింతా అత్తిలింగ, యినుమర్తి లింగమూర్తి, గోళ్ల మల్లేశ్వరరావు, కొండా చంటి పాల్గొన్నారు. ఆకాశదీపాన్ని ఏర్పాటుచేశారు.

యానాంలో కార్తీక సందడి

యానాం,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యానాంలో కార్తీక మాసం సందడి శనివారం మొదలైంది. ఆదిక సంఖ్యలో భక్తులు పుష్కరఘాట్‌కు తరలివచ్చారు. కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. బ్రాహ్మణులకు దీపదానం చేసి కార్తీక పూజలు ప్రారంభించారు. అభయ ఆంజేయస్వామికి, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో ఫెర్రీ రోడ్డు కార్తీక శోభతో కళకళలాడింది. స్థానిక శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరస్వామికి పూజలు చేశారు. కార్తీకమాసం మొదటిరోజు కావడంతో యానాంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

అంబాజీపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాచవరంలో వేంచేసియున్న శ్రీ పార్వతి రాజరాజేశ్వరిస్వామి వారి ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. మండలంలో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పలు ఆలయాల్లో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రుల దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

నెల రోజులు అన్నదానం

కాట్రేనికోన, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరస్వామి ఆలయంలో కార్తీకం సందర్భంగా నెలరోజుల పాటు భక్తులకు అన్నదానం నిర్వహించేలా స్థానికులు నిర్ణయించారు. శనివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సహకారంతో అన్నదానం జరిగింది. భక్తులకు ఆయన స్వయంగా వడ్డన చేశారు. నెలరోజులు అన్నదానంజరిగేలా చూడాలని పిలుపుఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరావు, గుత్తుల సాయి, త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భద్రరావు, పచ్చమట్ల సూర్యనారాయణరాజు, గంగుమళ్ళ రవి, బీర అంబేడ్కర్, గంగుమళ్ళ బాను పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శనివారం నుంచి ప్రారంభం కావడంతో మండలంలోని శైవక్షేత్రాలు, పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు శనివారం తెల్లవారుజామునే పాడ్యమి దీపాలు వదిలి పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముమ్మిడివరంలోని ఉమా సూరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించారు. ముమ్మిడివరంలో నగర పంచాయతీ పరిధి పల్లిపాలెంలో శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆదిత్య ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సప్తహారతులు నిర్వహించారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక గ్యాలరీ విశేషంగా ఆకర్షించింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పెన్మెత్స చిట్టిరాజు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్తీకమాసాన్ని సందర్భంగాఐదు శనివారాలు స్వామివారికి విశేష పూజలు, సప్త హారతులు నిర్వహిస్తున్నటట్టు ఆలయ నిర్వాహకులు పెన్మెత్సచిట్టిరాజు తెలిపారు. పల్లిపాలెం సెంటర్ నుంచి ఆలయం వరకు ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.


పుష్కరఘాట్లు అధ్వానం.. భక్తులకు తప్పని పాట్లు

ఐ.పోలవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): గోదావరి స్నానాలకు అనువుగా లేని పుష్కర ఘాట్లతో భక్తులకు పాట్లు తప్పడం లేదు. గోదావరి పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పుష్కర నిధులతో నిర్మించిన ఘాట్లు ప్రస్తుతం అధ్వాన్నంగా తయారయ్యాయి. కార్తీక మాసం ప్రారంభం కావడంతో మురమళ్ళ గోదావరిలో పుణ్యస్నానాలాచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. పుష్కరఘాట్లు శిధిలస్థితికి చేరడంతో భక్తులకు పాట్లు తప్పవని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణ లేక పుష్కరఘాట్లు మందుబాబులకు నిలయంగా మారాయి. పుష్కర ఘాట్ల వద్ద రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పుష్కరఘాట్లను అపరిశుభ్రం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చాలా వరకు పుష్కరఘాట్లు మట్టితో పూడుకుపోయాయి. మురమళ్ళ ప్రధాన పుష్కరఘాట్‌తో పాటు వీఐపీ పుష్కరఘాట్‌లను అపవిత్రం చేయడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు. గ్రామ పంచాయతీలు ఘాట్‌ల నిర్వహణను గాలికొదిలేయడంతో పరిస్థితి ఇంతగా దిగజారిందన్న ఆరోపణలున్నాయి. పుష్కరఘాట్‌ల వద్ద లైట్లు వెలగకపోవడంతో చీకట్లోనే స్నానాలు చేయాల్సిన పరిస్థితి. పుష్కర్‌ఘాట్‌లను ఆధునీకరించాలని భక్తులు కోరుతున్నారు.

గణపతినగర్‌లో అన్నదానం

యానాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా యానాం శివారు మెట్టకుర గణపతినగర్‌లోని విజయకనకదుర్గ అమ్మవారి ఆలయం ఆవరణలో శనివారం కమిటీ ప్రతినిదులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అమ్మవార్ని దర్శించుకుని, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

జాతీయ పోటీలకు అంజి చిత్రం



కాట్రేనికోన, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సృష్టి ఆర్ట్ అకాడమీ, కళాయజ్ఞ సంస్థలు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు అంజి ఆకొండికి స్థానం లభించింది. ప్రాచీన భారతం పేరుతో జరుగుతున్న ఈపోటీల్లో మన దేశానికి సంబంధించిన సుశ్రుతుడు, చరకుడు నిర్వహించిన ఆనాటి వైద్య విధానాలను ఈనాటి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మన దేశ ప్రాచీన వైద్య విధానం ప్రాముఖ్యతను, గొప్పదనాన్ని తెలుపుతూ అంజి ఆకొండి అక్రిలిక్ కలర్స్‌తో గీసిన అద్భుతమైన చిత్రం ఈ పోటీల్లో పాల్గొనే అర్హత దక్కించుకుంది.

ఇన్వెర్టర్ బహూకరణ

అమలాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కామనగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-2001లో 6 నుంచి 10వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు శనివారం పాఠశాలకు రూ.26వేలు విలువైన ఇన్వెర్టర్‌ను హెచ్ఎం వి.చక్రధరరావుకు అందజేయగా ఉపాధ్యాయులు అభినందించారు.

క్షేత్రస్థాయిలో పంటలపై అనుభవం పెంచుకోవాలి

అంబాజీపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రావేప్ విద్యార్థులు క్షేత్రస్థాయిలో పంటలపై అనుభవం పెంచుకోవాలని ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు సూచించారు. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రానికి శనివారం వెంకటరామన్నగూడెం కళాశాలకు చెందిన హార్టీకల్చర్ విద్యార్థులు అనుసందానమయ్యారు. వీరికి కొత్తపేట మండలం కేదార్లంక, వానపల్లి గ్రామాలను సందర్శించి అభ్యుదయ రైతులకు కేటాయించారు. వారు పండిస్తున్న పంటలు, వారి యజమాన్య పద్ధతులు తెలుసుకుని అలాగే రైతులకు విద్యార్థులు తెలిసిన విషయాలను వివరించాలని సూచించారు. తెగుళ్ల, పురుగులను గుర్తించి వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించాలన్నారు. సర్పంచ్ వెంకట రెడ్డి, భీమరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యత తనిఖీ

అమలాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చేపట్టిన పనులను ఎంజీఎన్ఆర్ఈజీఎస్ క్వాలిటీ కంట్రోల్ బృందం శనివారం తనిఖీ చేసింది. నడిపూడిలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, పాలగుమ్మిలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

మైక్, సౌండ్ సిస్టమ్ బహూకరణ

అంతర్వేది, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి అంతర్వేది దేవస్థానం గ్రామ అగ్నికుల క్షత్రియుల సంఘం మైక్, సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. రూ.50వేలు విలువగల మైక్, సౌండ్ సిస్టమ్‌ను ఆలయంలో అర్చకులు పూజా కార్యక్రమాల అనంతరం అందజేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది దేవస్థానం అగ్నికుల క్షత్రియుల సేవాసంఘం సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ లేదు

అమలాపురంరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ పేర్కొన్నారు. ప్రగతి నారీ సంఘం (పీఎన్ఎస్) ఆధ్వర్యంలో జిత్తుక వెంకటలక్ష్మి అధ్యక్షతన శనివారం చిట్టెమ్మచెరువు కమ్యూనిటీ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఇన్‌చార్జి ముత్తాబత్తుల నాగమణి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి చింతా విజయలక్ష్మి, కృష్ణవేణి, పి.వెంకటలక్ష్మి, ఎన్.విజయకుమారి, కె.అమరావతి, పి.లక్ష్మి, ఎన్.దుర్గ పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

అమలాపురంరూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు వివిధ రకాల ఉపకరణాలను అందించేందుకు ఈనెల4 నుంచి జిల్లాలో నియోజకవర్గాల వారీగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. వైద్య శిబిరాలు దివ్యాంగులకు ఏయే ఉపకరణాలు అవసరమో గుర్తించి వాటిని వారికి అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఈనెల4న ఉదయం 10నుంచి 3గంటల వరకు కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురంఅర్బన్, రూరల్ మండలాలకు రామచంద్రపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద శిబిరం నిర్వహిస్తారు. 5న ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట మండలాలకు రావులపాలెం ఎస్‌వీఎస్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోను, 6న సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల్లోని దివ్యాంగులకు రాజోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తారు. 7న ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం అర్బన్, రూరల్ మండలాలకు ఈదరపల్లి వంతెన వద్ద ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద, 8న తాళ్లరేవు, ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల దివ్యాంగులకు ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తారు. అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు శిబిరాలను విజయవంతంచేసి అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు అందించేలా చూడాలని ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు శనివారం సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండాలి



ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజోలు దీవిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు టీడీపీ, జనసేన నాయకులు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 60 గ్రామాలు ఉండడం వల్ల దాని పరిధి పెరిగిందని, నియోజకవర్గంలో వేరొక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుచేయాలని, అదేవిధంగా రాజోలు నియోజకవర్గంలోని 60గ్రామాలకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సేవలు పొందడానికి రావులపాలెం వెళ్ళాల్సి వస్తుందని, రాజోలు నియోజకవర్గాన్ని అమలాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోకి తీసుకురాలని కోరారు. కార్యక్రమంలో రాజోలు తెలుగు రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్, వర్ధినేటి బాబ్జి, గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల శ్రీను, చాగంటి స్వామి, సాపే కాశీ, పెచ్చెట్టి భాస్కరరావు, కాట్రేనిపాడు నాగేంద్ర, అప్పారి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

టైలరింగ్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



వినతిప్రత్రం అందజేస్తున్న జిల్లా ప్రైమరీ టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి దొంగ సత్యనారాయణమూర్తి తదితరులు

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టైలర్స్ ఫెడరేషన్‌కు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో కూడిన మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని టైలరింగ్ వృత్తిదారులు శనివారం ముమ్మిడివరంలోని చేనేత, జౌళిశాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. శ్రీబాలయోగి ప్రైమరీ టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంఘం జిల్లా కార్యదర్శి దొంగ సత్యనారాయణ ఆధ్వర్యంలో వారంతా ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.పెద్దిరాజుకు అందజేశారు. కార్యక్రమంలో జక్కంశెట్టి స్వామి, వాకా భాస్కరరావు, పీటీ మూర్తి, లేగ సుబ్రహ్మణ్యం, పోలేటి సుబ్బారావు, యింటి గణపతిరావు, కె.పెద్దిరాజు, కడలి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రికెట్ జిల్లాజట్టును అభినందిస్తున్న డీఈవో సలీం బాషా

అమలాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):ఈ నెలలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు క్రికెట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి తోట రవి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అండర్-14 బాలుర, అండర్-17 బాలబాలికల జట్లను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విజయ్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిక చేశామన్నారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా సందర్శించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్ల క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సెలక్షన్ కమిటీలో ఆర్.నాగకుమార్, పి.శ్రీనివాసరెడ్డి, బళ్ల శ్రీను, ధర్మశేఖర్ ఉన్నారు. ఎంపిక కార్యక్రమంలో డీఎస్‌డీవో పీఎస్ సురేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చొల్లంగి ప్రసాద్, బీవీవీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి గణపతి రామారావు, హెచ్ఎం అసోసియేషన్ కార్యదర్శి విత్తనాల శ్రీనివాసరావు, అమలాపురం జోన్ అధ్యక్షుడు వైఎస్వీ రమణారావు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొని బాలబాలికల జట్లను ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధ్యాయుడు ప్రసాద్‌కు సత్కారం



అమలాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 38ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పనిచేసి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పిన ఘనత ఉత్తమ ఉపాధ్యాయుడు టీఎస్సార్ ప్రసాద్‌కు దక్కుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఈదరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్న ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు పి.చంద్రరావు అధ్యక్షతన వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసాద్ సేవలను కొనియాడి సత్కరించారు.

ఈవో తీరుపై భక్తుల ఆగ్రహం

అల్లవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రామేశ్వరం శివాలయం వద్ద ఏర్పాట్లను ఈవో మహేంద్ర పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పునఃనిర్మాణం సందర్భంగా ఆలయం తొలగించిన ప్రాంతంలో దేవదాయ శాఖ కనీసం టెంట్ కూడా వేయలేదని తాగునీరు కూడా పెట్టలేదని ఆరోపించారు. ఈవో తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు లక్ష్మణేశ్వరం, కొమరగిరిపట్నం, గోడి, దేవగుప్తం, బోడసకుర్రు, గోడిలంక తదితర శివాలయాల వద్ద కార్తీక మాస ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

నేడు అమరజ్యోతి అంబేడ్కర్ గ్రంథం ఆవిష్కరణ

యానాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యానానికి చెందిన జనమిత్ర సంపాదకులు రచయిత కలైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి రచించిన అమరజ్యోతి డాక్టర్ అంబేడ్కర్ అనే పరిశోధనాత్మక గ్రంథ ఆవిష్కరణ సభ ఈనెల3న జరగనుంది. స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌లో జరిగే సభకు కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహిస్తారు. వైఎస్ఆర్ మెడిక్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉపాసక డాక్టర్ కోరుకొండ బాబ్జీ విశిష్ట అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. సభలో ప్రముఖులు పిల్లి రాంబాబు, డాక్టర్ మోకా పవన్‌కుమార్, కోరుకొండ భానుమతి, ముంగండ ఆశీర్వాదంలు గ్రంథాన్ని పఠనం చేస్తారు.

ఓటు హక్కుపై ప్రచారం

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కును ఈనెల6వ తేదీలోపు నమోదు చేసుకోవాలని టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులతో కలిసి శనివారం ముమ్మిడివరం శ్రీకృష్ణదేవరాయ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను కలిసి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బోనం కృష్ణ, చిక్కాల పనసయ్య, బొంతు శ్రీరాములు, గణేశుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇసుక కొరతతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొరత లేకుండా నిబంధనల్లో మార్పు తేవాలని కూటమి నాయకులు శనివారం తహశీల్దార్ ఆచార్యులుకు విన్నవించారు. మండలంలో ఇసుక రీచ్‌లు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, బొలిశెట్టి జయరామ్, చుట్టుగుళ్ల కిశోర్, వర్ధినేని బాబ్జి, కోలా సురేష్, రుద్ర శ్రీను, కాట్రేనిపాడు నాగేంద్ర, కంచి విశ్వనాథం, సాపే ఏకాదశి, పెచ్చెట్టి భాస్కరరావుపాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

అమలాపురంరూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): పేరూరులో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్నారన్నసమాచారంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ ఆదేశాలపై ఎస్ఐ బాలాజీ సిబ్బందితో శనివారం దాడిచేశారు. డేగల అంజిబాబు అనధికారికంగా మద్యంవిక్రయిస్తున్నట్టు గుర్తించి ఎనిమిది బాటిళ్ల స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు సీఐ వీటీవీవీ సత్యనారాయణతెలిపారు.

ఇద్దరికి గాయాలు

ఐ.పోలవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యానాం-ఎదుర్లంక వంతెనపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎదుర్లంక నుంచి యానాం వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఇద్దరి అరెస్టు

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన గాది చక్రభగవాన్ యానాం నుంచి తొమ్మిది నాన్‌డ్యూటీపెయిడ్ మద్యం సీసాలను తరలిస్తుండగా అన్నంపల్లి వద్ద అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ముమ్మిడివరంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి అమలాపురం టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకుని ముమ్మిడివరం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారన్నారు. నిందితులను శనివారం కోర్టుకు హాజరు పరిచినట్టు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

సాత్విక్‌సాయిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



క్రీడాకారులను అభినందించి సత్కరించిన క్రీడాభారతి ప్రతినిధులు

అమలాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోనసీమకు చెందిన అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను యువ క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు ఆకాంక్షించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో జరిగే వివిధ క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శనివారం అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో సత్కరించారు. క్రీడాభారతి అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను పలువురు అభినందించారు. అండర్-14 స్కేటింగ్‌లో కె.కుమార్‌సుధీర్, అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలకు వి.హేమంత్, బాలికల జట్టుకు నిమ్మకాయల చరిష్మసాయిరుత్విఆర్చరీకి ఎంపికైన కె.బుద్దేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, ఉండ్రు ముసలయ్య, ఆర్.రంగమణి, పీడీ కె.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో ఆచంట ఎమ్మెల్యే పూజలు

అంతర్వేది, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందించినట్టు ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ముప్పర్తి నాని, ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి, పోతురాజు కృష్ణ, రుద్రరాజు వెంకట్రామరాజు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠానికి చెందిన వి.చందన శనివారం తెల్లవారుజామున రెండో కాన్పుకు పురుటి నొప్పులు మొదలయ్యాయి. 108అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు అధికమయ్యాయి. ఈఎంటీ ప్రియదర్శినిదాసు పరీక్ష చేయగా ఆబ్‌నార్మల్ ప్రెజెంటేషన్ బటక్(ముందుకు పిరుదులు బయటకు రావడం) గుర్తించి అప్రమత్తమై చాకచక్యంగా డెలీవరీచేశారు. సకాలంలో డెలీవరీ చేసి నవజాత శిశువుకు ఆక్సిజన్‌తో సమీప ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. కార్యక్రమంలో అంబులెన్సు డ్రైవరు పి.రవి, సిబ్బందిని స్థానికులు, బంధువులు అభినందించారు.

విజిలెన్స్ వారోత్సవాల ర్యాలీ

యానాం, నవంబరు 2 2(ఆంధ్రజ్యోతి): యానాంలో పరిపాలనాధికారి మున్నిస్వామి నేతృత్వంలో విజిలెన్స్ వారోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి విశాఖపట్నంకు చెందిన సీబీఐ ఎస్పీ మురళీ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ముందుగా యానాం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం యానాం సర్వశిక్ష అభియాన్ సమావేశాపు హాలులో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ రాజశేఖరన్, సీబీఐ, ఏసీబీ, యానాం అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర హాకీ పోటీలకు దివ్యభాను



ఉప్పలగుప్తం,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఈనెల3,4,5 తేదీల్లో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-17 హాకీ పోటీలకు గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థిని నూకల రేవతీదివ్యభాను ఎంపికైనట్టు పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ తెలిపారు.దివ్యభానును హెచ్ఎం లంక రాణి, పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా అభినందించారు.

ర్యాంపులకు అవకాశం కల్పించాలి

పి.గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ తీర ప్రాంతాల్లో ఉన్న మత్స్యకార సొసైటీల సభ్యులకు ఇసుక తీసుకునే విధంగా వెసులుబాటు కల్పించాలని కోరుతూ పోతవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఇసుక తవ్వకాలు లేకపోవడంతో బోట్లు ఉన్న మత్స్యకార కుటుంబాలు రోడ్డున పడ్డాయని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సొంత అవసరాలకు, ప్రభుత్వ పనులు నిమిత్తం ఇసుకను తవ్వుకోవచ్చునన్నారు. కలెక్టర్ సూచనలతో స్థానిక ప్రజల అవసరాల మేరకు బోట్స్‌మేన్ సొసైటీలతో సమావేశం ఏర్పాటు చేసి ఒక రూపకల్పన చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో మత్స్యకార నాయకులు శేరు శ్రీనుబాబు, కొల్లు రాంబాబు, కొలా రాంబాబు, పెమ్మాడి మారుతి కృష్ణమోహన్, మల్లాడి గోపి, విష్ణు, ఉన్నారు.

ట్రాక్టర్‌కు నిప్పు పెట్టారని ఫిర్యాదు

ఉప్పలగుప్తం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తన ట్రాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారంటూ చినగాడవిల్లికి చెందిన మోరంపూడి మాచరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందినట్టు పోలీసులు తెలిపారు.

పెన్షనర్ల సంఘ కోశాధికారి రమణమూర్తి మృతి



కొత్తపేట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గ పెన్షనర్ల సంఘ కోశాధికారి ఎస్వీ రమణమూర్తి(76) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఆయన సుమారు 16 సంవత్సరాల నుంచి పెన్షనర్ల సంఘ కోశాధికారిగా సేవలు అందిస్తున్నారు.

భూసమస్యలు పరిష్కరించుకోండి

కె.గంగవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుంది. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు శీరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ భూసర్వేతో రైతులకు కలిగిన ఇబ్బందులు వివరించారు.

ఉపలోకాయుక్త పూజలు



ద్రాక్షారామ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం రాష్ట్ర ఉపలోకాయుక్త రజని సందర్శించారు. లోకాయుక్త దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉపలోకాయుక్త రజని దంపతులు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందుకున్నారు. ఆర్డీవో అఖిల ఉపలోకాయుక్తను మర్యాద పూర్వకంగా కలిశారు.

అవినీతిని నిరోధించాలని బుర్రకథా ప్రచారం



ద్రాక్షారామ, నవంబరు2: అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా రామచంద్రపురం మండలం వెలంపాలెం జ్యోతిరావు పూలే బాలికల గురుకులపాఠశాలలో శనివారం అవినీతి నిర్మూలనకు బుర్రకథ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గెయిల్ ఇండియా సౌజన్యంతో గొర్రెల రాము, కృష్ణ, శ్రీనివాసరావులు బుర్రకథ ప్రదర్శన జరిపారు. అవినీతిని వ్యతిరేకించాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, నేటికి వేళ్లూనుకున్న అవినీతిని కూకటివేళ్లతో పెకలించాలని బుర్రకథ ద్వారా తెలియచెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పావన్య, వైస్ ప్రిన్సిపాల్ జి.సుగుణ, తెలుగు అధ్యాపకురాలు గౌరి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాస్ ప్రోగ్రామ్ వలంటీర్లకు శిక్షణ

కె.గంగవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల వెలుగు కార్యాలయంలో శనివారం ఉల్లాస్ ప్రోగ్రామ్ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం వయోజనులకు విద్య నేర్పడం కోసం ఉల్లాస్ ప్రోగ్రామ్‌ను రూపొందించింది, దీని కోసం ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌లోనూ రోజు రెండు గంటల పాటు వయోజనులకు వాలంటీర్లతో శిక్షణ ఇవ్వనున్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ రహదారులు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నేలటూరు-వల్లూరు ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులకు ఆయన నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి ఎక్కడైతే గుంతలు ఉన్నాయో వాటిని పూడ్చేందుకు ప్రభుత్వం రూ.840 కోట్లు మంజూరు చేసిందన్నారు. మండపేట నియోజకవర్గంలోని అన్ని ఆర్‌అండ్‌బీ రహదారులకు రూ.4.30కోట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణ, ఏఈ, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొన్నా ఎమ్మెల్యే వేగుళ్ల, వేగుళ్ల లాలాకృష్ణ

బంగారు చీరలో దర్శనం



మండపేట, నవంబరు 2(ఆంధ్ర జ్యోతి) మండపేట పట్టణంలోని బూరు గుంట చేరువు గట్టున ఉన్న శ్రీఅన్నపూర్ణదేవి అమ్మవారు భక్తులకు బంగారు చీరలో దర్శన మిచ్చారు. ఆలయ నిర్వాహకులు ప్రతి ఏటా మూడు రోజులు అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు చీరను అలం కరించి దీపావళి రోజున భక్తులకు దర్శనం కల్పిస్తారు.

ఎర్రన్నాయుడు సేవలు చిరస్మరణీయం



రాయవరంలో ఎర్రన్నాయుడు విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు వేగుళ్ల, నల్లమిల్లి

రాయవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన కేంద్ర మాజీ మంత్రి కింజారపు ఎర్రన్నాయుడు సేవలు చిరస్మరణీయమని మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం రాయవరంలో ఎర్రన్నాయుడు వర్ధంతిని టీడీపీ నేత ఉండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పురస్కరించుని స్థానిక తుల్యబాగ వంతెనవద్ద ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహానికి ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ టీడీపీలో నిబద్ధత కలిగిన నేతగా, కేంద్ర మంత్రిగా ఎర్రన్నాయుడు చేసిన సేవలను కొనియాడారు. పలువురు బీసీ నేతలు ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీసీసెల్ నాయకుడు రేలంగి నాగేశ్వరరావు, అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు తెంటు సత్యనారాయణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గేదెల వీరబాబు, బోజంక శివరామకృష్ణ, బర్ల రాజు, జనసేన నేత దేవిశెట్టి చిన్ని, వల్లూరు శ్రీనివాసరావు, పి.మణిదీప్, చల్లా సత్యనారాయణ, నూలు వీరవెంకట సత్యనారాయణ, షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

158 మందికి ప్రాంగణ నియామకాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్ఎం కళాశాలలో నిర్వహించిన గ్రూపు ప్రాంగణ నియామకాల్లో వీఎస్ఎంకు చెందిన 158మంది నియామకాలు పొందినట్లు వీఎస్ఎం అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.బాలజీ తెలిపారు. 207మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 158మంది ఎంపికైనట్లు తెలిపారు. హీరో మోటోకార్ప్‌కు 64మంది, డైకిన్ కంపెనీకి 46 మంది, నియోలింక్ కంపెనీకి 48మంది వివిధ హోదాల్లో నియామకం అయినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి సుభాష్ శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కొత్తూరు గ్రామానికి చెందిన పర్వతిన రామాంజనేయమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంత్రి సుభాష్ సీఎం సహాయనిధి నుండి రూ.1.62లక్షలు మంజూరు చేయించారు. చెక్కును రామాంజనేయమ్మకు మంత్రి సుభాష్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఎట్టకేలకు మోక్షం





ఆలమూరు మండలం జొన్నాడ-కాకినాడ రోడ్డు దుస్థితి, పలివెల గంటి రోడ్డులో గోతులలో విటమిక్స్ వేస్తున్న ఎమ్మెల్యే బండారు

- ఆలమూరు మండలంలో నాలుగు రోడ్లకు రూ.కోటి 40లక్షలు మంజూరు
- కొత్తపేట నియోజకవర్గానికి రహదారుల అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు

ఆలమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా భారీ గుంతలతో ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న ఆలమూరు మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆలమూరు మండలంలోని జొన్నాడ-మండపేట రోడ్డుతోపాటు మరో మూడు రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ.కోటి 40 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను గుర్తించి తక్షణ రిపేర్లు నిమిత్తం ఈనిధులను మంజూరు చేశారు. జొన్నాడ-మండపేట రోడ్డుకు రూ.60 లక్షలు, వెదురుమూడి రోడ్డుకు రూ.60లక్షలు, గుమ్మిలేరు-నర్సిపూడి రోడ్డుకు రూ.12లక్షలు, మడికి-దుళ్ల రోడ్డుకు రూ.8లక్షల నిధులు మంజూరు అయినట్లు ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ సూర్యనారాయణరాజు తెలిపారు. ఈ పనులకు ఈనెల నాలుగో తేదీ లోపు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి త్వరితగతిన పనులు ప్రారంభించి, మరమ్మతులు చేపట్టనున్నట్టు వివరించారు.

ఇబ్బందిలేని ప్రయాణం లక్ష్యం

కొత్తపేట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): వాహనదారులకు ఇబ్బంది లేని ప్రయాణం దృష్ట్యా మిషన్ పాట్‌హోల్ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం మండలంలోని పలివెల- గంటి పల్లిపాలెం రహదారిలో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ ఈకార్యక్రమానికి సంబంధించి కొత్తపేట నియోజకవర్గానికి రూ.5కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, రహదారి ఇబ్బందులను తక్షణమే చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదే లక్ష్మీశ్రీనివాస్, కంఠంశెట్టి శ్రీనివాస్, చవల జగన్నాథం, నల్లా వెంకటరమణ, చీకరమిల్లి లోవరాజు, పత్తి అప్పు, గుత్తుల బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి సిలబస్‌ను త్వరితగతిన పూర్తిచేయాలి



డీఈవో షేక్ సలీంబాషా కొత్తపేట బాలికోన్నత పాఠశాలను సందర్శించి హెచ్‌ఎంలకు సూచనలు ఇస్తున్న దృశ్యం

కొత్తపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సిలబస్‌ను త్వరితగతిన పూర్తిచేసి డిసెంబరు 1నుంచి రివిజన్ మొదలుపెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారిషేక్ సలీంబాషా కోరారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి శనివారం విచ్చేసిన ఆయన రికార్డులను తనిఖీ చేసిన అనంతరం జడ్పీ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు.అనంతరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యాబోధన సక్రమంగా అందించాలన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపే విధంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాద పూర్వకంగా డీఈవో కలిశారు. కార్యక్రమంలో డీవైఈవో ఫణికుమార్, డీసీఈబీ సెక్రటరీ బీర హనుమంతరావు, సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శనేశ్వర ఆలయంలో భక్తుల సందడి

కొత్తపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర (మందేశ్వర) ఆలయానికి కార్తీకమాసం సందర్భం గా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువ జాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒక్కరోజు ఆదాయం రూ.1,58,758 వచ్చినట్లు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కొత్తపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకున్న వారికి వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యం, ప్రమాదాలకు గురై వైద్యం చేయించుకున్న 15 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు బుల్లితాత, చిలువూరి సతీష్ రాజు, రెడ్డి తాతాజీ, యెలిశెట్టి చిన్న, బండారు వీరబాబు, చీకట్ల అబ్బు, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆపార్ నమోదును వేగవంతం చేయండి

రావులపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఆపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టర్) నమోదును వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా అన్నారు. రావులపాలెంలోని సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో శనివారం రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద నరసింహఫణి అధ్యక్షతన ఎంఈవోలు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఆపార్ నంబరు ప్రామాణికం కానుందని చెప్పారు. టీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, బి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సోమేశ్వరస్వామి

రాయవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో మండలంలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. మండలంలోని బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి అర్చనలు చేశారు. వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. రాయవరం అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి, వెదురుపాక సోమేశ్వరస్వామి, వి.సావరం భీమేశ్వరస్వామి, రాయవరం రాజేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు జరిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నందదీపంలో భక్తులు పాల్గొన్నారు. వేకువ జాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్రేయపురం: కార్తీకమాసం ప్రారంభం కావడంతో మహిళలు పుణ్యస్నానాలు చేసి భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివాలయాల్లో అభిషేకాలు చేశారు. మహిళలు కేదారి గౌరీ నోము జరిపారు.

కపిలేశ్వరపురం: కార్తీకమాసం ప్రారంభాన్ని పురష్కరించుకుని శనివారం మండలంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కపిలేశ్వరపురంలో శ్రీఅగస్త్యేశ్వర, పాపవినాసేశ్వర స్వామి, జనార్ధనస్వామి ఆలయాలు, అంగర, కోరుమిల్లి, వల్లూరు తదితర గ్రామాల్లోని శైవక్షేత్రాలు, శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి గ్రామాల్లోని గౌతమీ గోదావరి నదిలో భక్తులు వేకువజామున పుణ్యస్నానాలు చేశారు. ఆలయాల్లో స్వామివార్లకు అభిషేకాలు, పూజలు జరిపి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి విడుదల చేయాలి

కె.గంగవరం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ డిమాండ్ చేశారు. కె.గంగ వరం మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో శనివారం ఆయన ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వాల సేకరణ చేశారు. గంగవరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వాల నమోదు చేసిన తరువాత విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, పి. బ్రహ్మానందం, పి. శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మండపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన ముగ్గురు దళిత యువకులపై ఏడిదకు చెందిన ఒక వర్గం యువకులు దాడి చేసిన ఘటనను ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. పీడీఎస్‌యు, ఏఐకేఎంఎస్ ఐఎఫ్‌టీయు సంఘాల నాయకులు బి.సిద్ధు, చికట్ల వేంకటేశ్వరరావు, వెంటపల్లి భీమశంకర్‌లు శనివారం బాధిత యువకులను పరామర్శించి జరిగిన ఘటనపై ఆరా తీశారు. దళితులపై దాడులు జరగకుండా కఠిన చట్టాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ర్యాలిలో పారిశుధ్య చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలిలో పారిశుధ్యం అధ్వా నంగా ఉండడంతో రోడ్డు మీదే చెత్త శీర్షికన ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. జడ్పీ రహదారికి వెళ్లే సీసీ రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను పంచాయతీ పారిశుధ్య కార్మికులతో తొలగించే చర్యలు చేపట్టారు. కార్యదర్శి కృష్ణమాచార్యులు పనులను పర్యవేక్షించారు.



పారిశుధ్య పనులు చేపడుతున్న పంచాయతీ సిబ్బంది

గత ప్రభుత్వ నిర్వాకం వల్లే రోడ్లన్నీ గుంతలు



గంగవరంలో రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుడుతున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకం వల్లే రోడ్లన్నీ నరకప్రాయంగా మారాయని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గంగవరం-ద్రాక్షారామ రహదా రిలో సౌభాగ్య రైస్ మిల్లు వద్ద రోడ్డు గుంతలు పూడ్చే కార్యక్రమానికి ఆయన భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో రామచం ద్రపు రం, కె.గంగవరంలో మండలాల్లో రోడ్డు మరమ్మతు లకు రూ.5.64 కోట్లు మంజూరైనట్లు ఆయన చెప్పారు. కార్య క్రమంలో ఆర్‌అండ్‌బి డీఈఎం. సూర్య నారాయణ, కూటమి నాయ కులు పోలిశెట్టి చంద్రశేఖర్, మేడిశెట్టి రవికు మార్, తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులు కావాలి



ఆలమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళలు విద్యావంతులు కావడం ద్వారా అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. ఆలమూరు మండల డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమంపై శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. మహిళలు కనీస విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ వయోజన విద్యను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతీరోజు డ్వాక్రా సంఘాలలో విద్యావంతులైన వారు నిరక్షరాస్యులైన వారిని గుర్తించి విద్యను నేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యావంతులైనవారు పది మందికి విద్యను ప్రతీరోజు సాయంత్రం ఐదు నుంచి 7 గంటల వరకు నేర్పించాలన్నారు. ఏపీఎం ఎం.ధనరాజు, గంగరాజు పాల్గొన్నారు.

కౌన్సిల్ రిక్విజేషన్ సమావేశం నిర్వహించాలి

మండపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కౌన్సిల్ రిక్విజేషన్ సమావేశం 16న నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వక్తలు కోరారు. టీడీపీ కౌన్సిలర్‌లు యారమాటి గంగరాజు, కాశీన కాశీవిశ్వనాధం శనివారం మున్సిపల్ కమిషనర్ టీ.వి.రంగారావును కలిసి 21 మంది టీడీపీ, వైసీపీ కౌన్సిలర్‌లు సంతకాల లేఖను అందజేశారు. సమావేశంలో మొదటి అంశంగా అజెండాలో 25వ వార్డులో రైతుబజార్ వద్ద వున్న అమ్మవారి ఆలయం వద్ద వున్న ఖాళీ స్థలాన్ని సీఐ క్వార్టర్ నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ 2019లో తీర్మానం రద్దు చేస్తూ ఆ ఏరియా ప్రజలు స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించుకునేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఈ అంశాన్ని కౌన్సిల్ రిక్విజేషన్ సమావేశానికి తీసుకురావాలని కోరారని కమిషనర్‌కు వారు చెప్పారు. రెండో అంశంగా కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం అమ్మవారి ఆలయం వద్ద కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం రూ 35 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి మంజూరు చేయాలని కౌన్సిల్ రిక్విజేషన్ సమావేశానికి తీసుకురావాలని కోరారు.









